క్లుప్తంగా

మహిళా చట్టాలపై అవగాహన



మహిళల చట్టాలపై మాట్లాడుతున్న న్యాయవాది కుమారి

పాలసముద్రం: మహిళల చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని చిత్తూరు న్యాయవాది కుమారి, హిమబిందు కోరారు. సోమవారం ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఏపీఎం కల్పలతారెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు మాట్లాడుతూ, పని చేసే చోట మహిళల సంరక్షణకు ఎన్నోచట్టాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ల వినియోగం బాగా పెరిగిందని, ఇది నిత్యావసర వస్తువులా మారిందన్నారు. ఏదైనా ప్రమాదం ముంచుకొస్తే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేస్తే పోలీసులు వచ్చి కాపాడుతారని పేర్కొన్నారు. పలు మహిళా చట్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



గోవిందయ్య (ఫైల్)

నగరి : మండలంలోని ముడిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత గోవిందయ్య(70) మృతికి మాజీ మంత్రి ఆర్‌కే రోజా సంతాపం తెలిపారు. సోమవారం ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. ఆదివారం ఈ మేరకు మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీకి గోవిందయ్య మృతి తీరనిలోటన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో భజన



భజన చేస్తున్న గోవిందభక్తులు

నగరి : పట్టణంలోని గోవిందమాల ధరించిన భక్తులు ధనుర్మాసం సందర్భంగా సోమవారం వేకువజామునే భజనలు చేపట్టారు. మాడవీధుల మీదుగా ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గురు గోవింద బాలాజీ మాట్లాడుతూ ఏటా ధనుర్మాసంలో భజనలు, పూజలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

వైభవంగా కాళభైరవాష్టమి



పూజలో పాల్గొన్న భక్తులు

నగరి : స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో సోమవారం కాళభైరవ అష్టమి పూజలను వైభవంగా నిర్వహించారు. కాళభైరవుని మూలమూర్తికి పాలు, పెరుగు పంచామృతంతో అభిషేకం చేశారు. పుష్పాలు, వడమాలతో స్వామిని సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉషశ్రీకి డాక్టరేట్



కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని ఉషశ్రీకి ఎస్వీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి పర్యవేక్షణలో »చిత్తూరు జిల్లా ప్రాథమిక సహకార సంఘాలు–వాటి పనితీరు« అనే అంశంపై ఉషశ్రీ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. దీనిపై ఎస్వీయూ డాక్టరేట్ ప్రకటించింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, కళాశాల స్థాపించినప్పటి నుంచి చదివిన వారిలో డాక్టరేట్ అందుకున్న తొలి వ్యక్తి ఉషశ్రీ అని అభినందించారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళం, పసుపు, కుంకుమ, విభూది తో అభిషేకం చేశారు.

కాణిపాకంలో పలువురు ప్రముఖులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని సోమవారం టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి స్వామి దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శీతాకాలం.. సీజనల్ భయం!



పుత్తూరులో ఓపీ కోసం క్యూలో ఉన్న రోగులు

వాతావరణ మార్పులతో ఇటు పెద్దలు, అటు చిన్నారులు సాధారణ జ్వరాలు, ఉబ్బసం, దగ్గు తదితర వ్యాధుల బారిన పడుతున్నారు. వరుస వర్షాలతోపాటు శీతాకాలం నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతోంది. దీంతో నగరి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉదయం 7 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. అలాగే సాయంత్రం 5 గంటల నుంచి చలి మొదలై మళ్లీ రాత్రి 10 గంటలకే మంచు తెర కమ్ముకోవడంతో వృద్ధులు, చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. మంచు కురిసే చలికాలంలో వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఈ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంతా తప్పనిసరిగా పాటించాల్సి ఉంది.

- పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- వృద్ధులు, చిన్నారులకు తప్పని అవస్థలు

విజయపురం: నగరి నియోజకవర్గంలో విజయపురం, నింద్ర, నగరి, పుత్తూరు, వడమాలపేట మండలాలు ఉన్నాయి. విజయపురం, వడమాలపేట, నింద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పుత్తూరు సామాజిక ఆరోగ్యకేంద్రం, నగరి ఏరియా ఆస్పత్రుల్లో గత వారం రోజులుగా పిల్లలు, పెద్దవారికి జలుబు, జ్వరం, దగ్గు కేసులు ఎక్కువగా ఉన్నాయి. రోజుకి పీహెచ్‌సీలో 100, ఏరియా ఆసుపత్రిలో 150కిపైగా రోగులు వస్తున్నారు. ఆయా ఆస్పత్రుల్లో ఈ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి.



నగరిలో మందుల కోసం వేచి ఉన్న రోగులు

చర్మవ్యాధులతో ఇబ్బందులు

శీతాకాలంలో ఉష్ణోగ్రత పడిపోవడంతో చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంది. విటమిన్–డి లోపంతో దద్దుర్లు, చర్మం పగుళ్లు వస్తాయి. అందుకే చలికాలంలో బయట తిరిగే టప్పుడు చర్మంపై దుమ్ము.. ధూళి పడకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

చిన్న పిల్లలు జాగ్రత్త

చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో శీతాకాలంలో త్వరగా వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. పిల్లలకు తల్లిపాలు శ్రేష్టమైనవి. వేడి చేసి చల్లార్చిన నీటినే తాగాలి. అలాగే ఉదయం మంచు ఉన్నప్పుడు తల, శరీరానికి ఉన్ని దుస్తులు వాడుకోవడం మంచిది. వాటితోపాటు పౌష్టికాహారాన్ని అందించాలి. పిల్లలకు అనారోగ్యంగా ఉన్నప్పుడు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. సొంత వైద్యం చేసుకోకుండా వైద్యుల సూచన మేరకు మందులు వాడితే మంచిదంటున్నారు.

నివారణ చర్యలు

- చిన్న పిల్లలను చలిలో బయట తిరగకుండా చూడాలి
- వెచ్చని దుస్తులు(ఉన్ని దుస్తులు) ధరింపజేయాలి
- ఇంట్లో వెచ్చగా ఉండేలా హీటర్లు వినియోగించుకోవాలి
- పిల్లలు నిద్రించే ప్రదేశంలోకి చల్లని గాలి చొరబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- వ్యాధి బారిన పడిన చిన్నారులకు సరైన చికిత్స అందిస్తే మూడు నుంచి వారం రోజుల్లో ఇబ్బందిని అధిగమించవచ్చు
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల నిమ్మరసం కలుపుకొని తాగాలి. దీంతో ఊపిరితిత్తుల్లో గాలి ప్రసరణ బాగా జరుగుతుంది. వ్యాయామం, నడకతో శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది.

ఆస్తమాతో అవస్థలు

పోషకాహార లోపంతో పిల్లలు, పెద్దల్లో ఆస్తమా వ్యాధి వృద్ధి చెందుతుంది. వ్యాధి గ్రస్తులు ముఖ్యంగా జలుబు, దగ్గు సమస్యతో అధికంగా బాధ పడుతుంటారు. జ్వరం 102 డిగ్రీలకు చేరడం, కోరింత దగ్గు, ముక్కు నుంచి నీరు కారడం వ్యాధి లక్షణాలుగా ఉంటాయి. 40 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో ఈ లక్షణాలు అధికంగా కనబడతాయి. ఈ సీజన్‌లో జాగ్రత్తగా ఉండాలి. దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండడం మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లినప్పుడు ఆరోగ్య సమస్యలు వచ్చిన వెంటనే దగ్గరలోని ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసుకోవాలి.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నకిలీ వెబ్‌సైట్‌లతో మోసపోవద్దని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ హెచ్చరించారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన జాతీయ వినియోగదారుల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపల్ గుర్తింపు పొందిన వెబ్‌సైట్‌లనే వినియోగించుకోవాలని, ఆ మేరకే ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ భాస్కరరాజు మాట్లాడుతూ వినియోగదారుల ఫోరమ్‌పై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఫోరమ్ విధి విధానాలను తెలుసుకోవాలని, అక్కడ మన కేసును మనమే వాదించుకునే వెసులుబాటు ఉంటుందని వివరించారు. కన్జ్యూమర్ క్లబ్ కన్వీనర్ గోపి మాట్లాడుతూ ధర, నాణ్యత, పరిమాణంలో మోసపోకుండా వినియోగదారుల చట్టం రక్షణ కల్పిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం అధ్యక్షుడు భాస్కర్, ఐక్యూ కో–ఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వేణుగోపాల్, కిరణ్, హరికృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

పుత్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ సంధ్య తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 1 అంగన్‌వాడీ వర్కర్–1, మినీ అంగన్‌వాడీ–1, సహాయకులు–10 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. వేణుగోపాలపురం అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు ఓసీ, వినాయకపురం ఎస్టీ కాలనీకి మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు ఎస్టీలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకుల (ఆయా) పోస్టులు పుత్తూరు మండలం నేసనూరు బీసీ–ఎ, రామకృష్ణాపురం ఓసీ, వీఎస్ఎస్‌పురం ఎస్సీ, రామసముద్రం ఓసీ, అక్కేరి హరిజనవాడ ఎస్సీ, ఉత్తరపుకండ్రిగ హరిజనవాడ ఎస్సీ, జయరాణిపురం ఓసీ, పరమేశ్వరమంగళం ఓసీ, వడమాలపేట మండలం వేమాపురం ఓసీ, అప్పలాయగుంట బీసీ–బీ కేటగిరీలకు కేటాయించినట్లు వివరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అభ్యర్థుల వయస్సు 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై, స్థానిక వివాహిత మహిళలు అర్హులని తెలిపారు. అలాగే సహాయకుల అభ్యర్థుల వయస్సు గరిష్ఠంగా 45 ఏళ్లు ఉండవచ్చని వెల్లడించారు. దరఖాస్తులను జనవరి 6వ తేదీలోపు పుత్తూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

శ్రీరంగరాజపురం : మండలంలోని 50 బసివిరెడ్డిపల్లె షికారు కాలనీలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ సరిత, సర్పంచ్ వరదమ్మ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని రకాల పండుగలను వైభవంగా జరుపుకోవడం మన దేశ సంస్కృతి అని అన్నారు. అన్ని మతాలపై సమభావన కలిగి ఉండటం, పరమత సహనాన్ని కలిగి ఉండడం తదితర లక్షణాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. మానవాళి పాప విమోచనార్థం యేసుక్రీస్తు జన్మించారని, ఆయన బోధనలు అందరికీ అనుసరణీయమన్నారు. అనంతరం పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు ఆటపాటలతో నృత్యం చేస్తూ అలరించారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ తులసిమణి, రవి, చిరంజీవి, విక్టర్, ఐజాక్ పాల్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో..

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఛాత్రోపాధ్యాయులు డైట్ ఆడిటోరియాన్ని రంగు రంగుల బెలూన్లతో అలంకరించి క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేశారు. అలాగే క్రిస్మస్ తాత వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు అధ్యాపకులు మాట్లాడారు. జీసస్ పుట్టుక, ఆయన అనుసరించిన జీవన విధానం, ప్రబోధం గురించి వివరించారు. అనంతరం ఛాత్రోపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్, చంగల్‌రాజు, రెడ్డి వెంకటరమణ, సునిత, నాగరాజు నాయక్, దైవప్రసాద్, మహ్మద్ రఫీ, బోధనేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.



డైట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

అన్నదాతలపై దమనకాండ అన్యాయం



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : దేశానికి వెన్నెముక లాంటి అన్నదాతలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండ అన్యాయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం దమనకాండ నిర్వహించడం దుర్మార్గమన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో అరెస్టు చేసిన రైతులను బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యులు జనార్దన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు ఉద్యమానికి తలొగ్గి గతంలో రైతాంగ వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చే సిందన్నారు. ప్రస్తుతం వాటిని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నం నాయుడు మాట్లాడుతూ నూతన వ్యవసాయ చట్టాలు, గత చట్టాలకు మసి బూసి మారేడు కాయ చేసిన చందంగా మారిందని ఎద్దేవా చేశారు. ఆ చట్టాల వల్ల రైతులకు ఎలాంటి మేలు జరగకపోగా కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా ఉందన్నారు. రైతులకు ఆ చట్టాలు తీవ్రంగా నష్టం జరిగేలా చేస్తాయని మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి గిట్టుబాటుధరను కల్పించాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులకు కనీస మద్దతు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలన్నారు. నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. నూతన సహకార చట్టాన్ని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు ఉమాపతి నాయుడు, విసి గోపినాథ్, మణి, దాసరి చంద్ర, విజయ్ గౌరి, రమాదేవి జమిలబి, కుమారి వి దామోదరం, మనోజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

బంగారుపాళెం: రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో సోమవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కేజీ సత్రం వద్ద ఈ నెల 20వ తేదీ లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టుకున్నారు. రూ 5.7 లక్షల విలువ చేసే 351 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి, తవణంపల్లె మండలం సరకల్లు గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్, తవణంపల్లెకు చెందిన ప్రదీప్‌కుమార్‌ను అరగొండ క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు. ఏఎస్ఐ మల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్, కానిస్టేబుల్ నీరజాక్షులు పాల్గొన్నారు.

శబరిమలకు ఆర్టీసీ బస్సులు



పుత్తూరు: శబరిమల యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు అద్దెకు సిద్ధంగా ఉన్నాయని డిపో మేనేజర్ ప్రశాంతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 36 సీట్ల కెపాసిటీ గల సూపర్ లగ్జరీ బస్సుకు 1 కి.మీ.కు రూ.57 అద్దెగా నిర్ణయించామన్నారు. అలాగే 40 సీట్ల అల్ట్రా డీలక్స్‌కు రూ.61 వంతున, 50 సీట్లు కలిగిన ఎక్స్‌ప్రెస్‌కు రూ.62 , 55 సీట్లు కలిగిన పల్లెవెలుగు బస్సుకు రూ.52 చొప్పున అద్దె చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎలాంటి అదనపు పన్నులు ఉండవని స్పష్టం చేశారు. బస్సులకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. బస్సును బుక్ చేసుకొనే గురుస్వామికి రూ.2 వేలు కమీషన్ ఇవ్వడంతో పాటు, ఏడుగురు వంట మనుషులు అందుబాటులో ఉంటారని వివరించారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మంగళవారం నుంచి పుత్తూరు–కై లాసకోనకు ప్రతిరోజూ ఉదయం 5.45, మధ్యాహ్నం 3.45 గంటలకు ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు.

'పీఎం సోలార్ సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు పీఎం సోలార్ సూర్యఘర్ ఉచిత సోలార్ ప్యానల్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సబ్సిడీతో ఉచితంగా అందజేస్తున్నారు. అదనపు విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు ఇస్తే నగదును వారి ఖాతాలో జమ చేస్తుందన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ వేదిక



ప్రజావేదికలో వివరాలను వెల్లడిస్తున్న డీఆర్పీలు

- 800 పనులకు రూ.5.60కోట్లు ఖర్చు
- రూ.80వేల రికవరీకి ఆదేశం

పాలసముద్రం: మండలంలో ఉపాధి హామీ పథకం కింద పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని అడిషనల్ పీడీ మల్లికార్జున అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 18వ విడత మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో 2023–24లో ఉపాధి హామీలో చేసిన 800 పనులకు సంబంధించి రూ.5.60కోట్లను కూలీలకు ఖర్చు పెట్టారు. దీనికి సంబంధించి సామాజిక తనిఖీ డీఆర్పీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిలో జరిగిన అవకతవకలను ప్రజావేదికలో వెల్లడించారు.మస్టర్‌లో కూలీల సంతకం లేకుండా బిల్లులు చేయడం, కొలతల్లో తేడాలు ఉన్నట్టు చెప్పారు. రూ.80 వేలు రికవరీకి ఆదేశించారు. అధికార పార్టీ నాయకులు కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ అన్బలగన్, డీవీఓ శివయ్య, ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీఓ క్రిష్ణమోహన్‌రెడ్డి, ఏపీఓ మార్గరెట్, ఎస్ఆర్పీ మల్లికార్జున, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రాహుకేతు దీపాలకు చెక్



అక్రమంగా అమ్ముతున్న ధారాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వారాలయం సమీపంలో అర్ధరాత్రి దాటిన తరువాత వెలుగుతున్న రాహుకేతు దీపాలకు ఆలయాధికారులు చెక్ పెట్టారు. వీటిపై పత్రికల్లో కథనాలు రావడంతో ఈఓ బాపిరెడ్డి స్పందించారు. ఆరుబయట నిద్రపోయే భక్తులను లేపి రాహుకేతు పూజలు పేరుతో దీపాలు పెట్టించే వ్యాపారులపై నిఘా పెట్టారు. హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బందిని బందోబస్తు ఏర్పాటు చేయించారు. వ్యాపారులు కల్తీనెయ్యి దీపాలు, పసుపు ధారాలు అమ్మకుండా కట్టడి చేశారు. వీరిని వెనుక నుంచి నడిపిస్తున్న మాజీ కౌన్సిలర్ రంగంలోకి వచ్చారు. దీంతో ఆలయాధికారులు ఆయన్ని హెచ్చరించారు. అర్ధరాత్రి తరువాత భక్తులతో దీపాలు వెలిగించడానికి తనకు కొంతమంది నాయకలు మద్దతు ఇస్తున్నారని ఆయన ఈ సందర్భంగా పేర్లు చెప్పగా ఆలయాధికారులు దాన్ని ఖండించారు. మరోసారి దీపాలు పెట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులను కూడా హెచ్చరించారు. ఆలయం తెరచిన తరువాత మాత్రమే పూజా సామగ్రి విక్రయించాలని లేకుంటే దుకాణాలు మూసివేస్తామని హెచ్చరించారు.

పడకేసిన పారిశుద్ధ్యం

పుత్తూరు: పట్టణంలో పారిశుధ్యం అత్యంత దారుణంగా తయారైంది. ఇందుకు పట్టణంలోని తిరుపతి–చెన్నై రహదారి పైనే మరుగుదొడ్ల మురుగు నీరు కొన్ని వారాల పాటు ప్రవహిస్తుండడం ఇందుకు నిలువెత్తు నిదర్శనం. అనునిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలోనే ఎస్‌బీఐ, ఆర్టీసీ బస్టాండ్, శ్రీనివాసా సినిమా థియేటర్ ఉన్నాయి. ఈ ప్రాంతంలోని ఓ ఇంటి ముందే సెప్టిక్ ట్యాంకును నిర్మించి ఉన్నారు. అది నిండిపోయి మురుగు బయటకు వచ్చి రహదారిపై ప్రవహిస్తోంది. ఆ ఇంటి నుంచి అర కిలోమీటరు వరకు మురుగు నీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు ముక్కులు మూసుకొని అక్కడి నుంచి పరుగులు పెడుతున్నారు. కళ్ల ముందు మురుగునీరు ప్రవహిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.



తిరుపతి రోడ్డుపై ప్రవహిస్తున్న లెట్రిన్ మురుగు

ఏడాదిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ!

60 వేలకు పైగా జనాభా కలిగిన పుత్తూరు మున్సిపాలిటీలో గత ఏడాదిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏడాది క్రితం రెగులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మోతీలాల్ పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో ఆ పోస్టు నేటికీ ఖాళీగా ఉంది. దీంతో ఎవరో ఒకరు శానిటేషన్ సెక్రటరీకి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలను అంటగడుతున్నారు. సచివాలయ పరిధిలో పనిచేసేవారికి మున్సిపాలిటీ మొత్తం బాధ్యతలు అప్పగించడం ద్వారా వారు పూర్తి స్థాయిలో పనిచేయలేక పోతున్నారు. సిబ్బంది సైతం సెక్రటరీ చెప్పినట్లు పని చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పట్టణంలో పారిశుద్ధ్యం సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది.



ఇంటి వద్ద సెప్టిక్ ట్యాంక్ నుంచి బయటకు వస్తున్న మురుగు



రోడ్డుపైకి ప్రవహిస్తున్న మురుగునీరు

తక్షణం చర్యలు తీసుకుంటాం



మరుగుదొడ్ల నుంచి నీరు రోడ్డుపైకి వస్తోందని ఎవరూ ఫిర్యాదు చేయలేదు. కనుక మా దృష్టికి రాలేదు. సదరు ఇంటి వారికి నోటీసు ఇచ్చి, తగిన చర్యలు తీసుకుంటాం. రెగులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గత కొంత కాలంగా లేని మాట నిజమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఎం.మంజునాథ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు